సాక్షి చిత్తూరు

సోమవారం । 21 । జూలై । 2025



'హద్దు'లు దాటిన అక్రమాలు

తమిళనాడు సరిహద్దు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని టీడీపీ నేతల అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

- 8లో



బోయకొండకు పోటెత్తిన భక్తులు

బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

- 8లో



ఆగని ఏనుగుల దాడి

పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె, దిగువమూర్తివారి పల్లెలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి.

- 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. గ్రీవెన్స్‌కు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజలు వారి సమస్యలను నేరుగా కలిసి చెప్పుకోవచ్చన్నారు.. ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిశీలించి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

క్రీడాభివృద్ధికి ఉద్యోగోన్నతి



సత్కారం పొందినవారితో పీడీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్లకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి రావడం ఆనందంగా ఉందని పీడీ బాబు తెలిపారు. ఆదివారం పీసీఆర్ పాఠశాలలో ఈ మేరకు ఉద్యోగోన్నతి పొందిన పీడీలను ఘనంగా సత్కరించారు. బాబు మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు పొందిన పీడీలు ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దారన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మందికి ప్రమోషన్ రావడం శుభపరిణామమని వెల్లడించారు. ఏ స్థాయి విధులనైనా పీడీలు సమర్థవంతంగా నిర్వర్తించగలరని వెల్లడించారు. ఉద్యోగోన్నతి పొందిన కోమల, సురేష్, సెల్వపాండియన్, కోటేశ్వరరావు, రామ, చంద్రశేఖర్, అమర్‌నాథ్, మురళీ, దామోదరంతోపాటు పీడీలు రవీంద్రారెడ్డి, నూరుద్దీన్, సుబ్రమణ్యంరెడ్డి, సిరాజ్, దేవానంద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల జిల్లా సంఘం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నుకున్నారు. ఆదివారం ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్ (జెడ్పీ, ఏఎల్‌పురం), ప్రధాన కార్యదర్శిగా సురేష్ (జెడ్పీ, పోలవరం), కోశాధికారిగా బాలచైతన్య (జెడ్పీ కల్లుపల్లె), గౌరవాధ్యక్షుడిగా భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గిరిరాజా (జెడ్పీ, టేకుమంద), రమేష్ (జెడ్పీ, బీఎన్‌ఆర్‌పేట), నాగేశ్వరరావు (జెడ్పీ, పైపాళ్యం) ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీదేవి (జెడ్పీ, ఉగ్రాణంపల్లె), హెడ్‌క్వార్టర్ కార్యదర్శిగా మోహన్ (ఎంసీహెచ్ఎస్, గిరింపేట), మహిళా కార్యదర్శిగా రత్నమ్మ (జెడ్పీ, ముత్తిరేవుల), చిట్టెమ్మ(జెడ్పీ, పిడివికం డ్రిగ) ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది.

టార్గెట్ పెద్దిరెడ్డి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'పెద్దాయన'గా పేరు ప్రతిష్టలు.. ప్రజా సేవే పరమావధిగా సేవలందించే కుటుంబసభ్యులు.. పేదలతో మమేకమై చేసే రాజకీయాలు.. జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో అనుయాయులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతం. దశాబ్దాలుగా ఆయన సంపాదించుకుంది జనాభిమానం. ఇదే చంద్రబాబుకు మింగుడుపడని అంశం. అందుకే స్టూడెంట్ పాలిటిక్స్ నుంచి తనకు కొరకరాని కొయ్యగా తయారైన పెద్దిరెడ్డిని లక్ష్యం చేసుకుని కుట్రలకు తెరతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కక్షగట్టి వేధింపులకు దిగుతున్నారు. తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టేందుకు తెగబడుతున్నారు. అందులో భాగంగానే నిరాధార ఆరోపణలతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయించారు.



ఎంపీ మిథున్‌రెడ్డి కారును దహనం చేసిన దృశ్యం (ఫైల్)

కక్షగట్టి చంద్రబాబు వేధింపులు

- పెద్దిరెడ్డి కుటుంబమే లక్ష్యంగా కుట్రలు
- సొంత నియోజకవర్గంలో సైతం తిరగనివ్వకుండా దాడులు
- ముందుగా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం పేరుతో నాటకాలు
- తర్వాత ప్రభుత్వ, అటవీభూముల ఆక్రమణ అంటూ ఆరోపణలు
- చివరకు తప్పుడు కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి వికటాట్టహాసాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబమే సీఎం చంద్రబాబు నాయుడుకు అడ్డు. తనకంటే పెద్దిరెడ్డి కుటుంబానికే ఆదరణ పెరుగుతోందని, అందుకే ఆ ఫ్యామిలీ లక్ష్యంగా చంద్రబాబు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదలు నేటి వరకు పెద్దిరెడ్డి కుటుంబంపై చేపట్టిన వేధింపులే నిదర్శనం అనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో అందరూ పెద్దిరెడ్డిని 'పెద్దాయన' అని పిలుస్తుండడం చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో పెద్దిరెడ్డి కుటుంబంపై ఏడాదిగా సాగుతున్న అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలే ఇందుకు సాక్ష్యంగా చూపుతున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దగ్ధం అయ్యాయి. ఈ ఘటన వెనుక మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హస్తం ఉందంటూ అప్పట్లో హడావుడి చేశారు. ఏదో జరిగిపోయిందని సీఎం చంద్రబాబు హుటాహుటిన హెలికాప్టర్ ఏర్పాటు చేసి డీజీపీ, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీని మదనపల్లెకు పంపించారు. తర్వాత ఆ ఘటనపై కేసులు నమోదు చేశారు. పెద్దిరెడ్డి అనుచరులు కొందరిని అరెస్టు చేశారు. అయితే అవేవీ ఇప్పటి వరకు రుజువు కాకపోవడంతో చివరకు ప్రభుత్వం వెనుకడుగు వేసింది.
- రాజంపేట పార్లమెంట్ పరిధిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరులు అనేక మందిని నానా రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. ఆస్తులు ధ్వంసం చేశారు. వ్యవసాయ పంటలను నాశనం చేశారు. ఇటుక బట్టీల్లోకి చొరబడి వాటిని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. సోమల మండలం కమ్మపల్లెలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులందరినీ నెలల పాటు చిత్రహింసలకు గురిచేశారు. కొంత మంది ఊరొదిలి వెళ్లేలా దౌర్జన్యాలకు తెగబడ్డారు. అనేక మందిపై దాడులు చేసి ఆస్పత్రుల పాలు చేశారు. ప్రధానంగా పుంగనూరులో భయానక వాతావరణం సృష్టించారు. తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్‌లు చేసి రిమాండ్ తరలించి పెద్దిరెడ్డి వర్గాన్ని భయాందోళనకు గురిచేసేందుకు యత్నించారు.
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గత ఏడాది జూలై 18న పుంగనూరు పర్యటనలో భాగంగా చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకుని టీడీపీ గూండాలు మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంపై రాళ్ల దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను కర్రలు, రాడ్లతో దారుణంగా తరిమికొట్టారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిని ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పు పెట్టారు. మరికొన్ని వాహనాలను ఎందుకూ పనికిరాకుండా నాశనం చేశారు. దాడి చేసింది టీడీపీ గూండాలైతే.. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు మొత్తం 115 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు పలువురికి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో కూటమి నేతలు కంగుతిన్నారు.
- పులిచెర్ల మండలం మంగళంపేట వద్ద పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన మామిడి తోటలలో అటవీశాఖకు చెందిన భూములు ఉన్నాయంటూ పచ్చమీడియాను అడ్డుపెట్టి ప్రభుత్వం నానా యాగీ చేసింది. డ్రోన్ కెమెరాలు, అధికారులను రంగంలోకి దింపి హంగామా సృష్టించింది.
- తిరుపతిలోపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం ఉన్న ప్రాంతం బుగ్గమఠానికి చెందిన భూముల్లోనే అని ఆరోపించి కూటమి ప్రభుత్వం కోర్టులో కేసులు దాఖలు చేసింది. అదే విధంగా కార్పొరేషన్ నిధులతో దారి ఏర్పాటు చేసుకున్నారని, అది కూడా ఆక్రమణేనంటూ ఎల్లో మీడియా ద్వారా విష ప్రచారం చేసింది.



పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి వాహనాలను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

తప్పుడు కేసులో..



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి


- తాజాగా లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసి కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించింది. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా చేసిన ఈ అక్రమ అరెస్ట్‌ను వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు సామాన్యులు సైతం తీవ్రంగా ఖండిస్తున్నారు.

జలయజ్ఞంపై బాబు విషం

కృష్ణమ్మ జలాలను పుంగనూరుకు తీసుకొచ్చి నిల్వ చేయడానికి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సంకల్పించారు. నాటి పాదయాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యను వివరించారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టులతో పడమటి ప్రాంతాలకు నీరు ఇచ్చే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లోని ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లెలో రూ.1200 కోట్ల వ్యయంతో ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ మూడు ప్రాజెక్టులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గుర్తింపు లభిస్తుందని, ఎన్నికల సమయంలో దీనిని అడ్డుకోవాలని చంద్రబాబునాయుడు ప్రాజెక్టులపై విషం చిమ్మారు. చోటా నేతలచే గ్రీన్ ట్రిబ్యూనల్‌లో తప్పుడు కేసులు వేసి పనులు అడ్డుకున్నారు. దీని కారణంగా పడమటి నియోజకవర్గాలకు జీవజలం లేక విలవిల్లాడే పరిస్థితి నెలకొంది.



టీడీపీ నేతలు అడ్డుకున్న నేతిగుట్లపల్లె రిజర్వాయర్





కేసులు వేసి టీడీపీ నేతలు అడ్డుపడడంతో అసంపూర్తిగా ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్



పుత్తూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి తదితరులు

కుట్రలకు పెద్దిరెడ్డి కుటుంబం వెరవదు



పెద్దిరెడ్డి కుటుంబ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిదశగా ఓ బూటకపు మద్యం కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చింది. అందులోకి ఎలాంటి సంబంధం లేని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి విచారణ పేరుతో సిట్ కార్యాలయానికి పిలిపించి అరెస్టు చేసింది. ప్రజాభిమానం కలిగిన మిథున్‌రెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలిచారు. అలాంటి నాయకుడిపై మద్యం కేసు నమోదు చేయడం దుర్మార్గం.

– నూకతోటి రాజేష్, సత్యవేదు నియోజకవర్గ సమన్వయకర్త

బాబు అరాచకాలు ప్రజలు చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న అరాచకాలను ప్రజలు చూస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. ఇది కుట్రపూరితంగా పెట్టిన అక్రమ కేసు. ఎన్ని కుట్రలు చేసినా, కేసులు పెట్టినా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

– భరత్, ఎమ్మెల్సీ, కుప్పం

ఎలాంటి ఆధారాలు లేకుండా..



లిక్కర్ కేసులో గతంలోనే సిట్ ముందు ఎంపీ మిథున్‌రెడ్డి వాస్తవాలను చెప్పారు. కానీ ఆయన పీఎల్ఆర్ కంపెనీకి ఎవరో పెట్టుబడిగా పెట్టిన రూ.5 కోట్లపై ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు పెట్టి ఆయన్ను అరెస్ట్ చేయడం చాలా బాధాకరం. చంద్రబాబు ఎందుకు వీరిని టార్గెట్ చేశారో జిల్లా ప్రజలందరికీ తెలుసు. న్యాయమే గెలుస్తుంది.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే పలమనేరు

ప్రశ్నిస్తుండడంతోనే అక్రమ కేసులు



ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రశ్నిస్తున్నామనే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్ష పూరితంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. లేని మద్యం కేసును సృష్టించి అన్యాయంగా అరెస్టులు చేయడం దారుణం. దీనికి పచ్చమూక మూల్యం చెల్లించుకోక తప్పదు.

– కృపాలక్ష్మి, సమన్వయకర్త గంగాధరనెల్లూరు నియోజకవర్గం

కక్షగట్టి అరెస్ట్ చేశారు



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటున్నారనే నెపంతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. కూటమి పాలనలో కక్షసాధింపులు తారస్థాయికి చేరాయి. ఉద్యోగులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కక్ష సాధింపులో భాగంగానే అరెస్టుల పరంపర జరుగుతోంది. 2014–19 పాలనాకాలానికి సంబంధించి చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై 13 అవినీతి కేసులు ఉన్నాయి. ఇందులో మద్యం కుంభకోణం కేసు కూడా కీలకమైంది. ఈ కేసులను నిర్వీర్యం చేసేందుకు సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఇలా చేస్తున్నారు.

– విజయానందరెడ్డి, సమన్వయకర్త చిత్తూరు నియోజకవర్గం

లోకేష్ నీకు చిప్పకూడే గతి



కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం బాధాకరం. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు పరిపాలన మీద దృష్టి పెట్టకుండా తమ స్వార్థం కోసం వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. యువగళం పాద యాత్రలో ప్రజలకు న్యాయం చేస్తామని మాట ఇచ్చిన నారా లోకేష్ పక్షాన ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వానికి మూల్యం చెల్లించే సమయం ఆసన్నమైంది.

– వీ.హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి

బాధలు 'బదిలీ'!





- సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓల చెడుగుడు
- ఎమ్మెల్యేలను కలిసి వెళ్లాలని హుకుం
- లేకుంటే తప్పని వేధింపులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 504 గ్రామ సచివాలయాల్లో 5,040 మంది, 108 వార్డు సచివాలయాల్లో 1,080 మంది ఉద్యోగులు వివిధ కేడర్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి జూన్ 15 నుంచి 30 వ తేదీ వరకు బదిలీల కసరత్తు నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించిన సచివాలయ ఉద్యోగులను బదిలీ చేశారు. బదిలీ అయిన వివిధ కేడర్‌ల ఉద్యోగులు జూలై 10వ తేదీలోపు కొత్త స్థానాల్లో విధుల్లో చేరిపోవాలి. అయితే పలువురు సచివాలయ ఉద్యోగులు రాజకీయ ఒత్తిడి కారణంగా ఇప్పటికీ విధుల్లో చేరలేదు.

కూటమి పాలనలో కక్ష సాధింపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడుతూనే ఉంది. చిరు జీతాలకు విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులకు తీవ్రమైన పని ఒత్తిడి కల్పించడంతో పాటు రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారు. బదిలీల తంతు ముగిసి సదరు ఉద్యోగులు నూతన స్థానాల్లో చేరేందుకు వెళితే ఇబ్బందికర పరిస్థితులు కల్పిస్తున్నారు. ఎవరి అనుమతితో తమ నియోజకవర్గంలోని సచివాలయానికి వచ్చావు అంటూ ఒత్తిడికి గురి చేస్తున్నారు. దీంవతో చాలా మంది సచివాలయ ఉద్యోగులు కొత్త స్థానాల్లో చేరలేని దుస్థితి.

నమస్తే పెట్టి వెళ్లు

కొత్త స్థానాల్లో చేరేందుకు వెళ్లిన సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓ వేధింపులకు పాల్పడుతున్నారు. ప్రధానంగా నగరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని ఎంపీడీఓలు నేరుగా సచివాలయ ఉద్యోగులకు కాల్ చేసి మరీ బెదిరిస్తున్నారు. మరో వైపు ఎమ్మెల్యేల పీఏలు కాల్ చేసి ఒకసారి వచ్చి ఎమ్మెల్యేకు నమస్తే పెట్టి వెళ్లు అంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వారి పీఏలు, ఎంపీడీఓలు ఇలా ఎవరికి వారు సచివాలయ ఉద్యోగులతో చెడుగుడు ఆడేసుకుంటున్నారు.

పట్టించుకోని జిల్లా యంత్రాంగం

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను జారీచేసింది. కలెక్టర్ అనుమతితో నిబంధనలను అనుసరించి బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియలో పలు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులు చెల్లకపోవడంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేధింపులు సరికాదు



సచివాలయ ఉద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడటం సరైన పద్ధతి కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులనే టార్గెట్ చేస్తోంది. ఇది దుర్మార్గమైన పద్ధతి. నిబంధనల మేరకు బదిలీలు పొందిన సచివాలయ ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సబబు కాదు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి.

- నగరి మండలంలోని ఓ సచివాలయంలో పనిచేస్తున్నఉద్యోగిని నింద్ర మండలం ఆరూరుకు బదిలీ చేశారు. సదరు ఉద్యోగి అక్కడ బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్లారు. అయితే ఎమ్మెల్యే నీ పేరు చెప్పలేదు...రెండు రోజులు ఆగు మాట్లాడి చెబుతా అనే సమాధానం అక్కడి ఎంపీడీవో నుంచి వచ్చింది. దీంతో ఆ సచివాలయ ఉద్యోగి నివ్వెరపోయారు. అదే విధంగా మరో ఉద్యోగి నింద్ర మండలంలోని ఎలకాటూరుకు బదిలీ అయ్యారు. తీరా అక్కడకు వెళ్లాక నిన్ను ఎస్ఆర్‌పురానికి మార్చేసామంటూ ఎంపీడీఓ చెప్పడంతో నివ్వెరపోయారు. ఇంకో ఉద్యోగి నగరి మండలం కీళపట్టు నుంచి వడమాలపేట మండలంలోని ఒక సచివాలయానికి బదిలీ కాగా, విధుల్లో చేరేందుకు వెళితే ఎమ్మెల్యేని కలిసి రమ్మ, లేకుంటే ఆయన పీఏతో ఫోన్ చేయించమని సాక్షాత్తు ఎంపీడీఓ తెగేసి చెప్పేశారు.
- ఈ తంతు ఒక్క నగరి నియోజకవర్గంలోనే కాదు. జిల్లాలోని పూతలపట్టు, యాదమరి, చిత్తూరు, పలమనేరు, జీడీ నెల్లూరు, చిత్తూరులో సైతం సాగుతోంది. నిబంధనల మేరకు బదిలీలు పొందిన సచివాలయ ఉద్యోగులు కొత్త స్థానాల్లో విధుల్లో చేరలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధుల వేధింపులతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితులు గతంలో ఎన్నడూ లేవంటూ సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఓటు'..ఇక కూతవేటు!

- ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- కసరత్తు చేపట్టిన జిల్లా యంత్రాంగం



జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్లకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలాచోట్ల 1,500 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉంది. దీంవతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు గంటల తరబడి క్యూలో నిరీక్షించాల్సిన దుస్థితి. ఎక్కువ సమయం నిలబడి ఉండలేక చాలా మంది ఓటింగ్‌కు దూరమయ్యే వారు. ఫలితంగా పోలింగ్ శాతం ఏటా తగ్గుతోంది. దీంతో ప్రతి 1,200 మంది ఓటర్లకు సమీపంలోనే ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇకపై కూతవేటు దూరంలోనే ఓటర్లకు పోలింగ్ కేంద్రం అందుబాటులోకి రానుంది.

1,200 మందికి పైగా ఉంటే..

జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,200 మందికి పైగా ఓటర్లు ఉంటే సమీపంలోని మరో పోలింగ్ కేంద్రంలోకి వారి ఓట్లు చేర్చడం లేదా కొత్తగా మరో కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కేంద్రం అసౌకర్యంగా ఉంటే అందుబాటులో మరోచోట ఏర్పాటు చేసి పకడ్బందీగా మౌళిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు లోపు అన్ని నియోజకవర్గాల ఆర్‌ఓల నుంచి ప్రతిపాదనలు తీసుకుని వాటిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

ప్రస్తుతం 1,776 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,776 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో దాదాపు 268 పోలింగ్ కేంద్రాల్లో 1,200 కు పైగా ఓటర్లు ఉన్నట్లు కలెక్టరేట్ అధికారులు గుర్తించారు. పోలింగ్ కేంద్రాల మార్పులపై కసరత్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తీసుకున్నారు. కొత్త కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు పూర్తిచేసి ముసాయిదా జాబితా తయారు చేయనున్నారు. ఎన్నికల సంఘం ఆమోదం వచ్చిన తర్వాత కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశముంది.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తవణంపల్లె : మండలంలోని తెల్లగుండ్లపల్లెలో శనివారం రాత్రి రంగయ్యనాయుడు (78) అనే వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్ నాయుడు తెలిపారు. వివరాలు.. తన చెల్లెలు కుమారుడిని సైకిల్‌పై తిప్పుతున్నాడని హేమాద్రి అనే యువకుడిపై రంగయ్యనాయుడు చేయిచేసుకున్నాడు. ఈ విషయాన్ని హేమాద్రి తన ఇంట్లో వాళ్లకి ఫిర్యాదు చేశాడు. దీంతో హేమాద్రి అన్న బాలాజీ మరో ముగ్గురు యువకులతో వచ్చి రంగయ్యనాయుడిని నిలదీయగా గొడవ జరిగింది. తర్వాత అందరూ ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం రంగయ్యనాయుడు తన ఇంటి ముందు షెడ్డులో ఉరివేసుకుని ఉన్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. రంగయ్యనాయుడుతో గొడవపడిన ముగ్గురు అనుమానితులను అదుపులోకి విచారిస్తున్నారు. మృతుడి కుమార్తె జనప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆగని ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): పంట పొలాలపై ఏనుగుల దాడి ఆగడంలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని దేవళంపేట పంచాయతీలోని కొమ్మిరెడ్డిగారిపల్లె, దిగవమూర్తివారిపల్లెలో ఆదివారం తెల్ల వారుజామున ఏనుగుల గుంపు మామిడి చెట్లను వేళ్లతో సహా పెకళించేశాయి. దీంతోపాటు వంకాయ పంట, వేరుశెనగ పంటను తొక్కి నాశనం చేశాయి.

'హద్దు'లు దాటిన అక్రమాలు

తమిళనాడు సరిహద్దు ప్రాంతాలను అక్రమార్కులు అడ్డాగా చేసుకుని రెచ్చిపోతున్నారు. అక్రమ రవాణానే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. అధికార పార్టీ నేతల అండతో యథేచ్ఛగా ఇసుక.. మట్టి దందా సాగిస్తున్నారు. ఇదే అదునుగా అంతర్రాష్ట్ర నేరగాళ్లు సైతం చెలరేగిపోతున్నారు. వరుస చోరీలతో ప్రజలను హడలెత్తిస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు గంజాయి విక్రయాలను సాగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అంతర్రాష్ట్ర నేరగాళ్లకు అడ్డాగా సరిహద్దు ప్రాంతాలు
- యథేచ్ఛగా గంజాయి, ఇసుక, బియ్యం, గ్రావెల్ రవాణా



జిల్లా సరిహద్దు వద్ద క్వారీ డస్ట్ ముసుగులో తమిళనాడుకు వెళుతూ పట్టుబడిన ఇసుక లారీలు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రకృతి వనరుల రక్షణలో తమిళనాడులోని కఠినమైన నిబంధనలు మన రాష్ట్రంలో లేకపోవడంతో జిల్లా సరిహద్దు ప్రాంతాలపై అక్రమార్కుల కన్నుపడింది. హద్దు దాటిస్తే భారీ ఆదాయం వస్తుండడంతో అక్రమాలకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. అధికార పార్టీ అండతో ఇసుక, మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా సాగుతోంది.

రూ.కోట్లకు పడగెత్తిన వ్యాపారం

తమిళనాడులో ఇసుక, గ్రావెల్ తవ్వకోవాలంటే ముందుగా కలెక్టర్, ఏడీ మైన్స్ అనుమతి తప్పనిసరి. తర్వాత ఆర్‌డీఓ, తహసీల్దార్ పర్మిషన్ సైతం పొందాలి. అయినప్పటికీ 3 నుంచి 5 అడుగుల వరకే ఇసుక తీయాలి. ప్రతి ట్రాక్టర్ ఇసుక, మట్టిపై పరదా కప్పుకునే వెళ్లాలి. వెయిటేజ్ ఎక్కువ ఉండకూడదు. అనుమతులు ఉన్నా వేకువజామున, రాత్రిళ్లు ఇసుక తవ్వకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే ఇసుక తరలించే వాహనాన్ని సీజ్ చేస్తారు. క్వారీపై కేసు నమోదు చేస్తారు. అయితే మన రాష్ట్రంలో రీచ్‌ల నుంచి ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అక్రమార్కులకు వరంగా మారింది. అధికార పార్టీ అండతో పలువురు స్మగ్లర్లు రాజంపేట చెయ్యేరు నది నుంచి రాష్ట్ర సరిహద్దులోని వీకేఆర్ పురం గ్రామానికి ఇసుక అవసరమైనట్లు బిల్లులు సృష్టించుకుని తీసుకువస్తున్నారు. ఇక్కడ చేర్చేందుకు ఎక్కడెక్కడ ఎంత ముట్టజెప్పాలో లెక్కలు తేల్చుకున్నారు. పచ్చనేతల అండతో పనగరి వరకూ ఎలాంటి అడ్డు లేకుండా ఇసుక టిప్పర్లు వచ్చేస్తున్నాయి. ఇక్కడ పక్కా ప్లానింగ్‌తో ఇసుకపై స్టోన్ డస్ట్ నింపి ఆ ముసుగులో జిల్లా సరిహద్దు దాటించేయడం మొదలు పెట్టారు. ఇలా ఒక్క టిప్పర్ తమిళనాడుకు వెళితే వచ్చే ఆదాయం రూ.1.5 లక్షల వరకు ఉంటుంది. సరాసరిగా రోజుకు పది టిప్పర్లు హద్దు దాటినట్లు తెలుస్తోంది. అంటే రోజుకు రూ.15 లక్షలు వస్తోంది. ఈ మేరకు నెలకు రూ.4.5 కోట్లు వెనకేసుకుంటున్నారు. ఈ తంతు ఏడాది పాటుగా జరుగుతుండడంతో ఇప్పటికే రూ.54 కోట్ల మేర ఇసుక తరలింపుతోనే పచ్చనేతలు, అక్రమార్కులు పోగేసుకున్నారు. ఈ నెల 13వ తేదీన ఇలా వచ్చిన టిప్పర్లను పోలీసులు పట్టుకోవడంతో అసలు బండారం బయటపడింది. వాటాల పంపిణీ వ్యవహారమే ఈ తంతును వెలుగులోకి తెచ్చిందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

జాతీయ రహదారి సాకుతో..

తిరుత్తణి నుంచి పుత్తూరు వరకు జాతీయ రహదారి పనులు జరుగుతుండడం అక్రమ గ్రావెల్ వ్యాపారులకు కలిసివచ్చింది. రహదారి పనులకంటూ కొండలు, గుట్టలను శరవేగంగా కరిగించేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా తొలిచేస్తున్నారు. టిప్పర్లకు టిప్పర్లు హద్దులు దాటించి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. తిరువళ్లూరు వరకు ఒక టిప్పరు తరలిస్తే రూ.10వేల ఆదాయం వస్తుంది. ప్రతి రోజు 200 టిప్పర్లు హద్దుదాటుతోంది. ఈ నెల 15వ తేదీన తమిళనాడుకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్లను తహసీల్దార్, ఎస్‌ఐ పట్టుకోవడం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

గంజాయి సైతం..

తమిళనాడులోని కాంచీపురం, తిరుత్తణి ప్రాంతాలకు నగరి మండలంలోని ఓజీ కుప్పం, మున్సిపల్ పరిధి కరకంతాపురం నుంచి గంజాయి సరఫరా జరుగుతూనే ఉంది. తరచూ తమిళనాడుకు చెందిన గంజాయి సరఫరాదారులు పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నారు. గంజాయి కోసం వచ్చేవారు డబ్బుల కోసం బైక్‌లో వచ్చేవారిని బెదిరించి చైన్లు లాక్కోవడం, ద్విచక్ర వాహనాలను అపహరించడం, దోపిడీలకు పాల్పడడం నిత్యకృత్యంగా మారింది. జూన్ 25వ తేదీన జిల్లా సరిహద్దు వీకేఆర్‌పురం వద్ద 2 కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం, అదే నెల 26, 30 తేదీల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడే అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేయడం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది.



నగరిలో పట్టుబడ్డ అంతరాష్ట్ర దొంగలు (ఫైల్)



రెండుకేజీల గంజాయితో నగరిలో పట్టుబడిన అంతరాష్ట్ర నేరగాడు (ఫైల్)



రాజంపేట చెయ్యేరు నుంచి ఇసుకతో వస్తున్న టిప్పర్లు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



లోకేష్ (ఫైల్)

గంగాధర నెల్లూరు: మండలంలోని మిట్ట కొత్తూరు గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన వరదరాజులు నాయుడు కుమారుడు ఎం.లోకేష్ (32) తన ఇంటి వద్ద మునగ చెట్టులో మునగాకు కోసుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు చెట్టుకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. లోకేష్‌కు ఏడాది క్రితం పెళ్లి అయింది. అతని భార్య ఇంద్రజ ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. లోకేష్ మృతితో ఆమె చేస్తున్న శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారించారు. మృతదేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో వుంది.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు



గాయపడిన రమేష్

చౌడేపల్లె : మండలంలోని కడియాల కుంట వద్ద ఆదివారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఐదురుగు గాయపడ్డారు. వివరాలు.. సోమల మండలం గొల్లపల్లెకు చెందిన కొందరు భక్తులు బోయకొండ గంగమ్మ దర్శనానికి ఆటోలో బయలుదేరారు. మార్గం మధ్యలో ప్రమాదం జరగడంతో మునిరాజా, రెడ్డెమ్మ, రమేష్‌తోపాటు మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వెంకటేష్ మృతదేహం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేటలో ఆదివారం అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. యాదమరి మండలం పత్రపల్లెకు చెందిన వెంకటేష్ (25) చిత్తూరు మండలం అనంతాపురం కాంప్లెక్స్ వద్ద మెకానిక్ షాపు నడుపుతున్నాడు. బీఎస్‌ఆర్‌పేటలోని ఓ బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో దుకాణానికి తాళం వేసి ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో ఏం జరిగిందో..ఏమో కానీ..తెల్లవారేసరికి చెరువు వద్ద మృతదేహంగా కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువ జామున 5 నుంచి సాయంత్రం 6 గంటలవరకు భక్తులతో కొండ కిక్కిరిసింది. గంగమ్మను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 40 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. భారీగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తినట్లు వెల్లడించారు.

ఒక్క రోజు ఆదాయం రూ.22.42 లక్షలు

బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం ఒక్కరోజు మాత్రమే రూ:22.42లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. వివిధ రకాల సేవా టికెట్లు, ప్రసాదం, తీర్థం టికెట్ల విక్రయం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. అలాగే నంద్యాలకు చెందిన ఫారెస్ట్ రేంజర్ పి. ఈశ్వరయ్య, మహేశ్వరమ్మ దంపతులు గోశాల నిర్వహణకు రూ.69,200 విరాళం అందజేసినట్లు వివరించారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు.

ప్రజల్లోకి బాబు మోసాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

పుత్తూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, అంతకంటే ఎక్కువ ఇస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని మాజీ మంత్రి ఆర్‌కే రోజా మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు. రోజా మాట్లాడుతూ ఏడాది పాలనలో చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. షూరిటీ పేరిట బాండులపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు సంతకాలు చేసి ఇచ్చారన్నారు. హామీలు అమలు చేయకపోతే ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్ ఎక్కడ నిద్రపోతున్నాడో, ఏ షూటింగ్‌లో ఉన్నాడో ఎవరికీ తెలియడం లేదని ఎద్దేవా చేశారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానన్న చంద్రబాబు ఇప్పుడు గల్లా ఖాళీగా ఉందని, సూపర్ సిక్స్ చూస్తుంటే భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇంటింటికి వెళ్లి సుపరిపాలన పేరిట అమలు చేసిన పథకాల గురించి చెప్పే ధైర్యం కూటమి నేతలకు ఉందా అంటూ ప్రశ్నించారు. ఇళ్ల వద్దకు వచ్చే టీడీపీ నేతలను ఎక్కడికక్కడ నిలదీసేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డిగ్రీ.. ప్రవేశాలు



జిల్లాలో డిగ్రీ కళాశాల సమాచారం

ప్రభుత్వ కళాశాలలు	17
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104
టీటీడీ డిగ్రీ కళాశాలలు	5
ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన తేదీ	ఏప్రిల్ 12
అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు	30 వేల మంది
గతేడాది ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు	51 శాతం
ప్రైవేటు కళాశాలలో అడ్మిషన్లు సరాసరి	62 శాతం
30శాతంలోపు అడ్మిషన్లు జరిగిన ప్రభుత్వ కళాశాలలు	11
సింగిల్ డిజిట్ ప్రవేశాలకు పరిమితమైన కోర్సులు	9

డిగ్రీ అడ్మిషన్లపై విద్యార్థులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ఇంటర్ పాసై 4 నెలలు గడుస్తున్నా అడ్మిషన్లు చేపట్టడంలో ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా వేల మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంగా మారింది. మొన్నటి వరకు డబుల్ మేజర్ అంటూ పాట పడిన ప్రభుత్వం..మళ్లీ గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ విధానమే అంటూ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రవేశాలు మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తుండడంతో విద్యార్థులు నిరాశకు లోనవుతున్నారు.

దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ హంగామా

- ఓపెన్ కాని ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్
- దరఖాస్తు ఎలా చేయాలో అర్థం కాక విద్యార్థులు సతమతం
- అయోమయంలో కళాశాలల అధ్యాపకులు
- సింగిల్ మేజర్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ కళాశాలలకు ఉత్తర్వులు
- మళ్లీ మొదటికొచ్చిన వ్యవహారం.. ఆగస్టులోనే నోటిఫికేషన్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఉన్నత విద్యామండలి

తిరుపతి సిటీ : ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు కావస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు చేపట్టడంలో ఉన్నత విద్యామండలి విఫలమైంది. విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతుల ఒత్తిడి తాళలేక ఎట్టకేలకు డిగ్రీ దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ హంగామా చేసి రెండు రోజుల క్రితం ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. కానీ ఇప్పటి వరకు ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎమ్‌డీసీ) వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అడ్మిషన్ల విధానంపై స్పష్టత లేకుండా ప్రకటన విడుదల చేసిన ఉన్నత విద్యామండలి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాల కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదు. డ్యుయల్ మేజర్ అంటూ అనవసర రాద్ధాంతం చేసి కమిటీ నివేదిక రావాలంటూ మూడు నెలలు కాలయాపన చేసిన ఉన్నత విద్యామండలి చివరకు చేతులెత్తేసింది. గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ సబ్జెక్టుతోనే అడ్మిషన్లు చేపట్టడమే ఉత్తమమని భావించి ఎట్టకేలకు ప్రకటన చేసింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ విద్యార్థి ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రగల్భాలు పలికింది. ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందిపరిచామంటూ ప్రకటన చేసిన ఉన్నత విద్యామండలి అడ్మిషన్ల నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోలేని స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలల చుట్టూ తిరుగుతున్నారు.

అడ్మిషన్లపై ప్రభావం

జిల్లాలోని ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇక డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యమవుతోందని గ్రహించి ఇంజినీరింగ్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఓపెన్ కాని వెబ్‌సైట్ ..

ఉన్నత విద్యామండలి అడ్మిషన్లకు అనుమతులు జారీ చేసినట్లు ప్రకటించినా ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ఇప్పటి వరకు తెరుచుకోకపోవడం గమనార్హం. దీంతో డిగ్రీ కళాశాలల అధికారులు, అధ్యాపకులు అయోమయంలో పడ్డారు. వెబ్‌సైట్ ఓపెన్ అయితేగాని ప్రవేశాలపై స్పష్టత రాదని తేల్చి చెబుతున్నారు. తమకే స్పష్టత లేనప్పుడు విద్యార్థులకు ఏమని సలహా ఇస్తామని అధ్యాపకులు చెబుతున్నారు.

దీంతో ఈ ఏడాది జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు కళాశాలలో భారీ స్థాయిలో అడ్మిషన్లు పడిపోయే ప్రమాదం ఉంది.

ఆగస్టు ఫస్ట్ వీక్‌లో నోటిఫికేషన్?

ఉన్నత విద్యా మండలి డిగ్రీలో డ్యుయల్ మేజర్ విధానం కష్టతరమని భావించి విరమించుకుంది. గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఈనెల 31వ తేదీలోపు సింగిల్ మేజర్ విధానం కోసం ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఆగస్టు మొదటి వారంలో ఇవ్వనున్నట్లు సమాచారం.

అంతా తికమకగా ఉంది



డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి చేసిన ప్రకటన తికమకగా ఉంది. ప్రవేశాలు ఆన్‌లైన్ అంటూ మళ్లీ ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవాలంటూ ప్రకటించింది. కనీసం వెబ్‌సైట్ ఇప్పటి వరకు ఓపెన్ కాలేదు. దీంతో మా తల్లిదండ్రులు ఇంజినీరింగ్ చేర్పిస్తామంటున్నారు. ప్రవేశాలు ఆలస్యం కావడంతో బీటెక్‌లో జాయిన్ అవుతున్నా. – శ్రావణి ప్రియ, విద్యార్థి, తిరుపతి

అధ్యాపకులకే అర్థం కావడం లేదు



డిగ్రీ ప్రవేశాల విధి విధానాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో కళాశాల అధ్యాపకులకు సైతం అర్థం కావడం లేదు. ఇప్పటికే పలుమార్లు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియపై ఆరా తీశాం. వెబ్‌సైట్ తెరుచుకుంటే కానీ తమకే స్పష్టత లేదని అధ్యాపకులు చెబుతున్నారు. –విజయశ్రీ, విద్యార్థిని, తిరుపతి

అధికారులపై చర్యలు తీసుకోవాలి



డిగ్రీ అడ్మిషన్లను అస్తవ్యస్తం చేసిన ఉన్నత విద్యామండలి అధికారులపై చర్యలు తీసుకోవాలి. డబుల్ మేజర్ , సింగిల్ అంటూ మూడు నెలలు కాలయాపన చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ అయోమయానికి గురి చేస్తున్నారు. – బండి చలపతి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



రాష్ట్ర చరిత్రలో డిగ్రీ ప్రవేశాలు జాప్యం కావడం ఇదే తొలిసారి. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఉన్నత విద్యా మండలి అధికారులు రెండు రోజుల క్రితం ఇచ్చిన ప్రకటన అయోమయంగా ఉంది. – భగత్ రవి, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా కార్యదర్శి